
ఆంధ్రజ్యోతి
*** గరిష్ఠం 29.5 కనిష్ఠం 22.8



ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 5 నవంబరు 2024

విద్యా ప్రమాణాల పెంపునకు

అదనపు కోర్సులు అవసరం

● ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



6

న్యూస్ బాక్స్

ప్రణాళికాబద్ధంగా బోధించాలి:డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న భిక్షపతి

పెద్దవూర, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రణాళికతో పాఠ్యాంశాలను బోధించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను గమనించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థుల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారు చదువులో ముందుండేలా చూడాలన్నారు. ప్రతిరోజు ప్రార్థన సమయానికంటే ముందే ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు,సీఆర్పీ వెంకటయ్య,రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్ మెడికల్ యూనిట్‌ను

వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



మొబైల్ మెడికల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

పెద్దవూర, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. పీ ఎం జన్మాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఎంఎంయు (మొబైల్ మెడికల్ యూనిట్) వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వాహనం తండాల్లో తిరుగుతూ ప్రజలకు బీపీ, షుగర్, టీబీ, లెప్రసీ పరీక్షలను నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి మందులను అందించనున్నట్లు చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, మెడికల్ ఆఫీసర్ నగేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైసెక్యూరిటీ కల్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు తరువాత ఆలయానికి కల్పించాల్సిన భద్రతపై ప్రభుత్వం బ్లూప్రింట్‌ను సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సును (ఎస్పీఎఫ్)ను మరింత పటిష్టపరచనుంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

యాదగిరి క్షేత్రానికి

హై సెక్యూరిటీ

బహుళ అంచెల భద్రత

» డిసెంబరు తర్వాత ఎస్పీఎఫ్ మరింత పటిష్టం
» వీవీఐపీలు,వీఐపీలు,భక్తుల భద్రత దృష్ట్యా నిర్ణయం
» కొండపై మినీ పోలీస్‌స్టేషన్?

భక్తుల రద్దీ, ఇతర భద్రతా కారణాల రీత్యా యాదాద్రి ఆలయానికి బహుళ అంచెల భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించింది. స్వామివారి ప్రధాన ఆలయంలోని గర్భగుడి విమాన గోపురానికి స్వర్ణతాపడం పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అర్ధాంతరంగా నిలిచిన స్వర్ణతాపడం పనులు కొనసాగించేందుకు నిర్ణయించారు. 2025 మార్చిలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల నాటికి దివ్య విమాన రాజగోపురం బంగారు తాపడం పనులు పూర్తిచేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, వచ్చే ఫిబ్రవరిలోనే ఈ పనులు పూర్తయ్యేలా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అయితే బంగారు తాపడం పనులు కొనసాగుతుండగానే యాదగిరి క్షేత్రం భద్రతను ప్రభుత్వం సమీక్షించింది. ఇప్పటికే గుట్టపై ఏసీపీ స్థాయి అధికారిని నియమించిన ప్రభుత్వం, ఆలయ భద్రత మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం స్వామివారిని దర్శించుకునేందుకు సాధారణ రోజుల్లో నిత్యం 10వేల నుంచి 15వేల మంది భక్తులు వస్తున్నారు. సెలవు రోజుల్లో 40వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయానికి వీవీఐపీలు, వీఐపీల

- మిగతా 6వ పేజీలో...



ఇందిరమ్మ ఇళ్లకు

సన్నాహాలు

» ప్రతీ నియోజకవర్గానికి 3,500 కేటాయింపు
» ఉమ్మడి జిల్లాలో తొలిదశలో 42వేల ఇళ్లకు ఆర్థికసాయం
» సొంత స్థలం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం
» అర్హుల ఎంపికకు ప్రత్యేక యాప్
» వారంలోగా ఇందిరమ్మ కమిటీలకు ఆమోదం

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అక్కడక్కడ నిర్మించగా, అవి కొన్ని చోట్ల పూర్తికాగా, మరి కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా నిలిచాయి. కనీసం పూర్తయిన ఇళ్లను సైతం గత ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించలేదు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అబాసుపాలైంది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక పేదలకు సొంతింటి కలపై దృష్టిసారించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున స్థలం ఉన్నవారికి ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇలా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు తొలిదశలో 42వేల ఇళ్లకు ఆర్థికసాయం మంజూరుకానుంది. జనాభా ప్రాతిపాదికన ప్రతీ గ్రామానికి ఎన్ని ఇళ్లకు సాయం కేటాయించాలనే దానిపై స్థానిక అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా అర్హులను ఎంపిక చేసి గ్రామసభల్లో జాబితాను ప్రదర్శించి, ఆ తరువాత ప్రకటిస్తారు. తొలుత సొంత స్థలం ఉన్న

- మిగతా 7వ పేజీలో...

ధాన్యం నిల్వకు ఏర్పాట్లు చేసుకోవాలి

» రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ » నార్కట్‌పల్లి, చిట్యాలలో కొనుగోలు కేంద్రాల తనిఖీ



నార్కట్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న చౌహాన్

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు చేరవేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తరపున నిల్వ ఏర్పాట్లు కూడా చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ చౌహాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. నార్కట్‌పల్లి మం డల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం రాశుల నుంచి స్వయంగా తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులతో పాటు ప్రభుత్వం తరపున నిల్వ కోసం చేసిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌ను అడిగారు. గతంలో సీఎంఆర్ సకాలంలో చెల్లించిన మిల్లర్లందరికీ రొటేషన్ పద్ధతిలో సీఎంఆర్‌కు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు వచ్చిన కాంటా వేసిన, ఎగుమతి చేసిన, ధాన్యం వివరాలను రికార్డుల ఆధారంగా చౌహాన్ తనిఖీ చేశారు. ,ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల అభ్యంతరాలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ప్యాడీ క్లీనర్ యంత్రాలను ఆయన పరిశీలించారు.

చిట్యాల, నవంబర్4, (ఆంధ్రజ్యోతి) :రైతులకు ఎటులాంటి నష్టం కలుగకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ చౌహాన్ తెలిపారు. సోమవారం రాత్రి చిట్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడం చరిత్రాత్మకం నిర్ణయమన్నారు. కస్టం మిల్లింగ్ రైస్(సీఎం ఆర్)కు సంబంధించి మిల్లర్ల వద్ద తీసుకుంటున్న 10శాతం బ్యాంకు గ్యారెంటీ సీఎంఆర్ పూర్తి కాగానే ఎలాంటి కొర్రీలు పెట్టకుండా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కస్టమ్ మిల్లింగ్ చార్జీలు దొడ్డురకం ధాన్యానికి క్వింటాకు రూ.40, సన్న రకం ధాన్యానికి రూ.50 (గతంలో క్వింటాకు రూ.10) పెంచామన్నారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమాల్లో అడిషన ల్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, మేనేజర్ హరీశ్, డీసీవో పత్యానాయక్, తహసీ ల్దార్ కృష్ణ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, పందిరి శ్రీనివాస్, పోలా పెద్దయ్య పాల్గొన్నారు.

మూసీపై గందరగోళానికి తెరదించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మూసీ ప్రక్షాళనపై ప్రజల్లో విపక్షాల సృష్టిస్తున్న గందరగోళానికి తెరదించాల్సిన అవసరం ఉందని రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనకు వస్తున్న సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూసీ వల్ల దశాబ్దాలుగా ఉమ్మడి నల్ల గొండ జిల్లా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే.. కాళ్లు, చేతులు వంకర్లుపోయి, క్యాన్సర్ వంటి జబ్బులతో చచ్చిపోతుంటే.. ఆనాడు బీఆర్ఎస్ కనీసం పట్టించుకున్న పాపానలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కోట్లమంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అన్నారు. అలాగే 22 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని,దేశంలో ఎక్కడాలేని విధంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి లక్షల మందిని నైపుణ్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి జిల్లాకు మంచినీటి సరఫరా అందించేందుకు రూ. 210 కోట్ల రూపాయలతో ప్రారంభిస్తున్న పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేకు మంత్రి సూచించారు. మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మూసీ బాధితులను రెచ్చగొట్టి రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయత్నిస్తున్నాయని.. పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేసి ఈ తప్పుడు ప్రచారాలను అడ్డుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల ప్రజలు గోదావరి, కృష్ణానీళ్లతో వ్యవసాయం చేస్తూ, తాగునీటిని వాడుకుంటుంటే, భయంకరమైన రసాయనలు కలిసిన మురికినీళ్లను ఉమ్మడి నల్లగొండ ప్రజలు ఎందుకు వాడుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై విపక్షాలు చేసే విమర్శలను మంత్రి వెంకట్‌రెడ్డి తిప్పికొట్టినంతగా మరే నాయకుడు తిప్పికొట్టడంలేదని సమావేశంలో పాల్గొన్న ప్రభ ుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పార్టీ నేతలపై ప్రతిపక్షపార్టీల నేతలు ప్రెస్ మీట్లలో, సోషల్ మీడియా వేదికగా అడ్డగోలుగా విమర్శిస్తుంటే ఇతర నేతలు మౌనంగా ఉండటం భావ్యం కాదని, అందరం కలిసికట్టుగా విపక్షాలను ఎదుర్కోవాలని భువనగిరి ఎంపీ చామల అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను, సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని మరో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, చెప్పారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డెయిరీ గుడిపాటి మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌సైడ్

ఐఏఎస్ అధికారికి

తప్పిన ప్రమాదం

● అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు
● సూర్యాపేట జిల్లాలో ఘటన

7

అదుపు తప్పి

ఆర్టీసీ బస్సు బోల్తా

● నలుగురు ప్రయాణికులకు గాయాలు ● వృద్ధురాలికి తీవ్రంగా..
● పరిస్థితి విషమం ● హైదరాబాద్‌కు తరలింపు

7

పెండింగ్ బిల్లులు

విడుదల చేయాలి

● మాజీ సర్పంచుల డిమాండ్
● చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా ముందస్తు అరెస్టు



నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన మాజీ సర్పంచులు

7

ద్విచక్రవాహనాలు తస్కరించి..

జల్సాలు చేస్తూ

● పట్టుబడ్డ బైక్ దొంగలు

ప్రభుత్వ పథకాలపై

దృష్టిసారించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



బాధితుల నుంచి వినతులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, రామగిరి, హాలియా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్య పథకాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు అన్ని స్థాయిల అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే ఈనెల 6 నుంచి ప్రారంభం కానుందని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఎన్యూమరేటర్లకు ప్రస్తుతం శిక్షణ కొనసాగుతోందని, అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని వందశాతం చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. కాగా, 'ప్రజావాణి'లో 45 మంది ఫిర్యాదులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలి

సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. సోమవారం నల్లగొండ, హాలియా మున్సిపల్ కౌన్సిల్ హాళ్ల లో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. సర్వే పట్ల ఎన్యుమరేటర్లు నిర్లక్ష్యంగా ఉండవద్దని, పూర్తి జాగ్రత్తగా వివరాలు సేకరించాలన్నారు. కేటాయించిన ప్రతి ఇంటి నుండి వివరాలు సేకరించాలని, సర్వే కి వెళ్లిన సమయంలో ఒక వేళ ఎవరైనా ఇంట్లో లేనట్లయితే మరోసారి ఆ ఇల్లును సందర్శించాలని, వివరాలు సేకరించిన తర్వాత ఇండ్లకు స్టిక్కర్ అతికించాలని సూచించారు. సర్వేలో ఏవైనా సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ముసాబ్ అహ్మద్, రామ దుర్గారెడ్డి, హాలియా ప్రత్యేకాధికారి భిక్షపతి, టీపీవో సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సోమవారం

కిటకిటలాడిన

ఆలయాలు





కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలను దర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించారు.

6

వర్గీకరణ అమలు చేయకుంటే యుద్ధమే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మహాసభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నల్లగొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి సర్కార్‌తో యుద్ధం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా దేశంలో మేమే మొదట వర్గీకరణ అమలు చేస్తామని, అన్ని నోటిఫికేషన్లకు వర్తించేలా ఆర్డినెన్స్ తెస్తామని మోసపు మాటలు చెప్పిన ముఖ్యమంత్రి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ నమ్మకద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి నమ్మితే ఎంత మోసం చేస్తాడో టీచర్ల ఉద్యోగాల నియామకాలతో తేలిపోయిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడంతో 10వేలకు పైగా ఉద్యోగాలు మాదిగ, మాదిగ ఉప కులాలు కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి గ్రూపు 1, 2, 3, 4 ఉద్యోగాలు, వివిధ డిపార్ట్‌మెంట్ల ఉద్యోగాలను కూడా తమకు దక్కకుండా రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మందకృష్ణ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయడానికి నిర్లక్ష్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మాటలకు, చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు. వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేయడమంటే తమ జాతుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలన్నీ నిలిపివేయాలని, ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసంపై ధర్మ యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత రథయాత్రతో తెలంగాణలో ఉన్న అన్ని నియోజక వర్గాలు, మండలాలను చుట్టుముట్టి డిసెంబరు 21వ తేదీన చలో హైదరాబాద్‌తో ధర్మయుద్ధ మహాప్రదర్శనతో రేవంత్ సర్కార్‌తో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో నాయకులు కందుకూరి సోమన్న, గాదె రమేష్, జానకి రామయ్య చౌదరి, చిప్పలపల్లి సోమశేఖర్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మూడు జిల్లాల అధ్యక్షులు బకరం శ్రీనివాస్, యాతాకుల రాజయ్య, నల్ల చంద్రస్వామి, చింత వినయ్‌కుమార్, రామకృష్ణ, మామిడి సైదులు, నాయకులు కొమ్ము హరి, కురుపాటి కమలమ్మ, కొమిరే స్వామి, ఆడపు నాగర్జున, మేడి శంకర్, మడుపు శ్రీనివాస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR,A.P
H.M.O.P.No.228 of 2023
Between
B.Raghavendra ...Petitioner
And
B.Anusha, ...Respondent
NOTICE TO THE RESPONDENT
To
B.Anusha, W/o B.Raghavendra, D/o late R.Bhaskar Reddy, Hindu, aged about 32 years, Pvt.Employee, now R/at H.No.3-54,Enuguladori Village, Narkatpalli Post & Mandal, Nalgonda District-508254.
Madam ,Please take notice that the above named petitioner filed the above case against you for dissolution of marriage between you and the petitioner and the same is posted to 04-12-2024 for your appearance before the said court. Please be present on the said date at about 10.30 A.M either in person or through an Advocate failing which the matter will be decided exparte.
E.RENUKA
Advocate for Petitioner
Place : Chittoor, Date:04.11.2024

ఆంధ్రజ్యోతికి 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
గట్టుప్పల్ మండల ప్రజలకు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ఆంధ్రజ్యోతి వారికోత్సవ శుభాకాంక్షలు
గట్టుప్పల్ మండల
పలు శాఖల అధికారులు

కిట్టీపార్టీ కొత్తపుంతలు

ఆధునికతకు తోడు విజ్ఞాన, ఆధ్యాత్మికతల మేళవింపు ● 12 ఏళ్లుగా కొనసాగిస్తున్న చిట్యాల మహిళలు



తిరుమల శ్రీవారి సేవలో చిట్యాల పట్టణానికి చెందిన కిట్టీ పార్టీ సభ్యులు

ఆధునిక కిట్టిపార్టీలకు ఆధ్యాత్మికతను జోడించారు నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన మహిళలు. కిట్టి పార్టీలు అనగానే పాశ్చాత్య నాగరికత గుర్తుకువస్తుంది. కానీ, ఈ మహిళలు అందుకు భిన్నంగా పార్టీలను విజ్ఞానవేదికలుగా మార్చారు. కిట్టీపార్టీ సభ్యులు అన్నిజాతీయ దినోత్సవాలతో పాటు ధార్మిక ఉత్సవాల్లోనూ పాల్గొంటున్నారు. పేరుకే పార్టీ అయినా ఆధ్యాత్మిక, విజ్ఞాన కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. పట్టణానికి చెందిన 15మంది మహిళలు 12ఏళ్ళ కిందట కిట్టీ టీం ఏర్పాటు చేసుకుని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-చిట్యాల)

ఉత్సవాల సంబురం

కిట్టీ పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో స్వాతంత్య, గణతంత్ర, మహిళా దినోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్థానిక కనకదుర్గ ఆలయం, శివాలయాల్లో జరిగే అన్ని ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరుమలలో శ్రీవారి సేవ చేయడానికీ వెళ్తుంటారు. అంతేగాకుండా ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి ఆధ్యాత్మిక యాత్రలు చేస్తుంటారు. హరితహారం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.



ఒకప్పుడు పెద్దపట్టణాల్లో ధనవంతుల కుటుంబాలకు చెందిన మహిళలు మాత్రమే జరుపుకునే కిట్టీ పార్టీలు ప్రస్తుతం చిన్న పట్టణాల్లో మధ్యతరగతి మహిళలు కూడా జరుపుకుంటున్నారు. చిట్యాలకు చెందిన కిట్టీ పార్టీ బృందంలో అందరూ కోడళ్లుగా వచ్చిన వారే ఉన్నారు. సాధారణంగా కిట్టీ పార్టీ సభ్యులు వారాంతంలో కలుస్తారు. కానీ, చిట్యాలలోని కిట్టీ పార్టీ సభ్యులు నెలకొకసారి సభ్యుల్లోని ఒకరి ఇంట్లో సమావేశమవుతారు. స్కూల్ విద్యార్థుల్లా తారతమ్యం లేకుండా ఒకే రంగు(యూనిఫాం)గా దుస్తులు ధరిస్తారు. రోజంతా ఆ ఇంట్లోనే ఉంటు అందరూ కలిసి ఇష్టమైన వంటలను చేసుకుని తినడంతో పాటు ఆట, పాటలతో హోరెత్తిస్తారు. విజ్ఞాన, ఆధ్యాత్మిక అంశాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్షేమ సమాచారాలు తెలుసుకోవడంతో పాటు ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండడానికి అవసరాలకు ఉపయోగపడేందుకు ఒక చిట్టీ కూడా నిర్వహిస్తున్నారు.

కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది



నెలకొకసారి నిర్వహించే కిట్టీ పార్టీ మాలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపుతుంది. అన్ని విషయాల్లో ఒకరికొకరం ప్రోత్సహించుకుంటూ ఉత్సాహపడుతుంటాం. ఎవరికైనా సమస్య వస్తే చర్చిస్తాం, సలహాలు, కొంతవరకు పరిష్కార మార్గాలు సూచిస్తాం. దీంతో అందరూ అండగా ఉన్నారనే మనోధైర్యం లభిస్తోంది.

వాసా రాధ, కిట్టీ పార్టీ సభ్యురాలు

సామాజిక స్పృహ పెరిగింది



కిట్టీ పార్టీల్లో నిర్వహించే చర్చా కార్యక్రమాల వల్ల సమాజంపై అవగాహన పెరిగింది. పిల్లల్ని ఎలా పెంచాలి, సమాజం పట్ల మన బాధ్యతలు ఏంటీ అనే విషయాలు తెలుస్తాయి. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరు అనే ధైర్యం లభిస్తుంది. కిట్టీ పార్టీలను సరదా కోసం కాకుండా సామాజిక చైతన్యం కోసం కూడా వినియోగిస్తున్నాం.

పందిరి గీత, కిట్టీపార్టీ సభ్యురాలు, కౌన్సిలర్

ఆధ్యాత్మిక చైతన్యం

వేంకటేశ్వరనగర్‌లో సామూహిక సహస్రనామ పారాయణం
శివాయలంలో ఎనిమిది మందితో ప్రారంభమై నేడు 100 మందికి
శుభకార్యాల్లో కోరిన వారి ఇళ్లలో పారాయణం నిర్వహణ

లోకకల్యాణార్థం అందరూ బాగుండాలని ప్రార్థిస్తున్నారు నల్లగొండ జిల్లా వేంకటేశ్వరగనగర్‌కు చెందిన వాసులు. ఎనిమిది మందితో మొదలైన పారాయణ బృందం నేడు 100 మందికి చేరింది. మొదట్లో నిష్ఠగా పారాయణం చేస్తున్న వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఒకరివెంట ఒకరు అన్నట్లుగా ఈ బృందంలో చేరారు. దీంతో ఇంతింతై వటుడింతై అన్నట్లు బృంద పరిధి మరింత పెరిగింది. అందరూ బాగుండాలని, అందులో మేముండాలని అనే భావనగా సాగుతున్న ఈ సామూహిక దైవపారాయణం ఆధ్యాత్మికతను విస్తృతం చేస్తోంది.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్‌కు చెందిన కొందరు భక్తిభావంతో నిత్యం గీతాపారాయణం, సహస్రనామ, విష్ణుసహస్రనామ పారాయణానికి శ్రీకారం చుట్టారు. మొదట్లో ఆర్యవైశ్యుల ఇళ్లలోనే పారాయణం జరిగేది. అయితే రానురాను బృందంలో చేరే వారి సంఖ్య పెరగడంతో ఆర్యవైశ్యులతో పాటు అన్నిసామాజిక వర్గాలకు చెందిన భక్తులు కోరిన ఇళ్లలో సామూహిక శివ సహస్రనామ, విష్ణుసహస్రనామ, గీతాపారాయణాలు నిర్వహిస్తున్నారు. 2015 జూలై 25న కేవలం ఎనిమిది మందితో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక పారాయణం మొదలైంది. ప్రతీ సోమవారం అత్యంత వైభవంగా చేపట్టేవారు. ఆ తర్వాత స్థానికుల్లో పారాయణాల పట్ల ఆసక్తి పెరిగింది. దీంతో ప్రస్తుతం 50 నుంచి 100 వంద వరకు ప్రతీ సోమవారం నిర్వహించే పారాయణంలో పాల్గొంటున్నారు. ఇందులో అన్నివర్గాల వారు పాల్గొంటున్నారు.



సహస్రపారాయణం చేస్తున్న వేంకటేశ్వరనగర్ వాసులు

పారాయణంతో ఆరోగ్యం



ఏకాగ్రతతో నిర్వహించే సామూహిక పారాయణంతో ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు. మనస్సు ధ్యానం చేసినట్లవుతుంది. ఒకరిద్దరు చేసే కార్యక్రమం కాకుండా చాలా మంది కలిసి చేసే మంచి బృహత్కార్యం. అది కూడా మా వేంకటేశ్వరనగర్‌లో కొన సాగటం చాలా ఆనందమనిపిస్తుంది. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పెద్దలకు ప్రత్యేక కృజ్ఞతలు

వూరె పద్మ, వేంకటేశ్వరనగర్

సేవాభావం పెరుగుతుంది



సామూహిక పారాయణంతో ఎన్నో లాభాలున్నాయి. కులమత భేదాలు లేకుండా మనషులంతా ఒక్కటే అనే సంకల్పంతో అందరిలోకి వెళ్లంది. భగవాన్ బసవేశ్వరుడు కూడా ఇదే నినాదాన్ని సమాజానికి చాటిచెప్పారు. నేను అనే స్వార్థం వీడి మనము అనే సామాజిక నినాదం సామూహిక పారాయణంతో పెరుగుతుంది. ఇది విస్తృతంగా కొనసాగిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

విజయలక్ష్మి, విశ్రాంత అధ్యాపకురాలు

ఐక్యతను పెంచినవారమవుతాం



ఏడాది నుంచి సామూహిక పారాయణంలో పాల్గొంటున్నా. ఇక్కడి వచ్చిన వారి అందరిలో ఐక్యత పెరిగింది. శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రతీ సోమవారం శివనామ, విష్ణుసహస్రనామ, గీతా పారాయణం కొనసాగుతుందని చాలామందికి తెలియదు. రెండేళ్లుగా ఎవరు పిలిచినా వారి ఇళ్లకు వెళ్లి సంపద కలగాలని ఈశ్వరుడిని ఆరాధించే సంస్కృతి ఆదర్శనీయంగా నిలుస్తుంది.

ఇడుకుళ్ల స్వప్న, గొడుకొండ్ల

దైవచింతన కలుగుతోంది



శివాలయంలో ఎనిమిది మందితో సామూ హిక పారాయణం ప్రారంభించాం. ప్రస్తుతం 50 నుంచి 100 మంది వరకు హాజరవుతున్నారు. పారాయణంతో ప్రతి ఒక్కరిలో దైవచింతన పెంపొందుతోంది.యువత, ఉద్యోగులు ఎంతో ఆసక్తితో పాల్గొంటున్నారు.

వూరె యాదయ్య, వూరె పర్వతాలు

భక్తిభావాన్ని పెంచేందుకు కృషి



సమాజంలోని ప్రతిఒక్కరూ దైవచింతన కలిగి ఉండేందుకు కృషి చేస్తున్నాం. అన్నివర్గాల వారు పాల్గొని భక్తిభావం పెంపొందించుకోవాలి. దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తోంది.

వూరె లక్ష్మణ్, దేవస్థాన చైర్మన్,

కార్తీక తొలి సోమవారం సందడి



ఖువనగిరిలో విశేష అలంకరణలో సోమేశ్వరుడు



యాదగిరి కొండపై దీపాలంకరణ



గుట్టలో అఖండ దీపానికి నూనె పోస్తున్న ఈవో భాస్కర్‌రావు





నల్లగొండలోని శ్రీకృష్ణ మందిరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, హుజూర్‌నగర్‌లో చేతిలో దీపాలతో భక్తులు

కార్తీక మాస తొలి సోమవారం కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సందడి నెలకొంది. ప్రధానంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. యాదాద్రికొండపై సత్యనారాయణ వ్రతపూజల్లో, దీపోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఛాయా సోమేశ్వరాలయంలో భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. సాయంత్రం కొలనులో దీపాలను వదిలారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు పిల్లలమర్రి, మేళ్లచెర్వులో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కార్తీక శోభలో ఛాయాసోమేశ్వరాలయం



కొలనులో దీపాలను వదులుతున్న మహిళలు



నల్లగొండలోని ఛాయాసోమేశ్వరాలయ ఎదుట కొలనులో ఆలయ ప్రతిబింబం



యాదాద్రికొండపై వ్రతపూజల్లో పాల్గొన్న భక్తులు



కొండపై సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా బాలికల నాట్యప్రదర్శన

యాదగిరి క్షేత్రానికి హైసెక్యూరిటీ

(5పేజీ తరువాయి)

రాక కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో వారితోపాటు భక్తులకు భద్రతా రీత్యా ఎస్పీఎఫ్ బలగాలతో బహుళ అంచెల భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు గుట్టపైన మినీ పోలీస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలిసింది.

ఫిబ్రవరిలోగా స్వర్ణతాపడం పనులు

స్వామివారి విమాన గోపురానికి బంగారు తాపడం పనులను ప్రభుత్వం తమిళనాడు రాష్ట్రానికి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్‌కు అప్పగించింది. 2025 ఫిబ్రవరిలోగా స్వర్ణతాపడం పనులు పూర్తి చేసేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 10వేల చదరపు అడుగుల మేర బంగారు తాపడం చేయాల్సి ఉంది. చదరపు అడుగుకు రూ.3,900 చొప్పున సదరు సంస్థకు ప్రభుత్వం చెల్లించనుంది. బంగారం తాపడం చేసేందుకు మొత్తం రూ.3.90కోట్లు ఖర్చు కానుంది. స్వామివారి ప్రధానాలయంలోని విమాన గోపురం 10,500 ఎస్ఎఫ్‌టీల మేర ఉంది. దీనికి 60కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం ఆలయ అధికారుల వద్ద బంగారం తాపడం కోసం భక్తులు సమర్పించి నగదు రూ.20.50కోట్ల మేర ఉంది. భక్తులు స్వామివారికి మొక్కుల రూపంలో చెల్లించిన బంగారం సుమారు 12కిలోల వరకు ఉంది. భక్తులు విరాళంగా ఇచ్చిన బంగారం 10.500 కిలోలు ఉంది. అదేవిధంగా స్వామివారికి భక్తులు సమర్పించిన వెండి 2,300కిలోల వరకు ఉంది. బంగారంతో పాటు ప్రస్తుతం ఆలయ బ్యాంకు ఖాతాలో ఉన్న విరాళాల నగదుతో 60కిలలో వరకు బంగారం సమకూరే అవకాశం ఉంది. విరాళాల సేకరణ ద్వారా మరిన్ని నిధులు సమకూర్చి పనులు పూర్తి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

యాదగిరిక్షేత్రానికి భద్రత పెంచుతున్నాం



లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులందరికీ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఆలయానికి వీవీఐపీలు, వీఐపీలతోపాటు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యాదగిరి క్షేత్రానికి ప్రభుత్వం భద్రత పెంచనుంది. ఆలయానికి కేటాయించిన భద్రతా సిబ్బంది డిసెంబరు తర్వాత పూర్తిస్థాయిలో రానున్నారు.

భాస్కరరావు, ఆలయ ఈవో

తవ్వకాల్లో బయటపడిన ఆంజనేయస్వామి విగ్రహం

మిర్యాలగూడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం రామాలయం వీధిలో పురాతన ఆంజనేయస్వామి విగ్రహం బయట పడింది. కాలనీకి చెందిన ముస్లిం యువకుడు తన పంక్చర్ దుకాణం పక్కన గొయ్యి తవ్వుతుండగా పురాతన ఆంజనేయ స్వామి విగ్రహం కన్పించింది. ఆ యువకుడు వెంటనే స్థానికులకు చెప్పాడు. స్థానికుల సమాచారంతో మునిసిపల్, పోలీసు, రెవెన్యూ అక్కడికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారణ చేసిన భక్తులు విగ్రహానికి పూజలు చేశారు. విగ్రహం పురాతన కాలానికి చెందిన చెందినదిగా స్థానికులు తెలిపారు. విగ్రహాన్ని సమీపంలోని రామాలయంలో భద్రపరిచారు.



తవ్వకాల్లో బయటపడిన ఆంజనేయస్వామి విగ్రహం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆలేరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జ్యోతి రాజు సోమవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థినులు దూడల అంజలి, ఐల అర్పిత ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులు ఈ నెల 7, 8, 9 తేదీల్లో యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు, పీడీ గడసందుల మధుసూదన్, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రావు, నజీరోద్దీన్, కాంతారావు, శ్రీనివాస్, కృపాకర్, రాంచందర్, సంగీత, దయాకర్ తదితరులు అభినందించారు.

● నాగార్జునసాగర్: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వివిధ క్రీడా పోటీలకు సాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరుగు పందెంలో అండర్-17,19 విభాగాల్లో ప్రేమ్‌కుమార్, హైజంప్‌లో శ్రీకాంత్, ఖోఖోలో అనిల్ ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను పీడీలు జ్యోతి, అరుణ, పీఈటీ నరసింహ ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్


● డిండి : నల్లగొండ జిల్లా డిండి మండలం చెర్కుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇస్లావత్ మౌనిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోప్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో గోప్యానాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీను, ఉపాధ్యాయులు మౌనికను శాలువాతో సన్మానించారు.



మౌనిక

విద్యా ప్రమాణాల పెంపునకు
అదనపు కోర్సులు అవసరం

● ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలు, నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు అవసరమని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం యునివర్సిటీలో వివిధ శాఖల అధిపతులు, బీవోఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నైపుణ్యాల పెంపునకు ప్రతి విభాగం నుంచి అదనపు కోర్సులను అందించే ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నైపుణ్య శిక్షణను అందించేలా ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. పక్షం రోజులకొకసారి నిపుణులను ఆహ్వానించి తరగతులను నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, మిర్యాల రమేష్, ఉపేందర్‌రెడ్డి, శ్రీదేవి, అరుణ ప్రియ, సుధారాణి, మాధురి, రూప, తిరుమల, రాంచందర్, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేలపై వ్యాఖ్యా సరికాదు

● తీన్మార్ మల్లన్న వ్యవహారం అధిష్ఠానం చూసుకుంటుంది: ఎంపీ రఘువీర్



దామరచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా కొనసాగుతూ ముఖ్యమంత్రి, పార్టీ ఎమ్మెల్యేలపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలోని బంగారుమైసమ్మ తల్లి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడలో జరిగిన బీసీగర్జన సభలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలపై తీన్మార్ మల్లన్న సామాజికవర్గాల వారీగా వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బీఫాంపై గెలిచి పార్టీ నేతలపైనే ఆయన దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపునకు తామంతా ఎంతో కృషి చేశామన్నారు. అందరూ కలిసి అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేస్తేనే అభ్యర్థులుగా గెలుస్తారని అన్నారు. తీన్మార్ మల్లన్న విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం చూసుకుంటుందని ఎంపీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారికి తప్పిన ప్రమాదం

● అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



అదుపుతప్పి పొలాల్లోకి దూసుకువెళ్లిన కారు, ఐఏఎస్ అధికారి వాణీప్రసాద్

మునగాల, సూర్యాపేట సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణీప్రసాద్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం 10గంటల సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆమె ఫార్చునర్ కారులో వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఆకుపాముల గ్రామ శివారులో ముందు వెళుతున్న వాహనాన్ని(శాంత్రో) దాటే క్రమంలో డ్రైవర్ ఆ కారును వెనుకనుంచి ఢీకొట్టటంతో అదుపు తప్పి రోడ్డు దిగి 100 అడుగుల దూరం పొలంలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో వాణీప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శాంత్రో కారు వెనుక భాగం కుడి వైపున దెబ్బతింది. కారులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. వాణీప్రసాద్ ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పిన ప్రాంతమంతా కల్వర్టుతో ఉండటంతో పాటు సమీపంలో బావి కూడా ఉంది. పెను ప్రమాదం నుంచి వాణీప్రసాద్ త్రుటిలో బయటపడ్డారు. సమీపంలోని ఆకుపాముల గ్రామస్థులు ప్రమాద స్థలం వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో సూర్యానారాయణ, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జనరల్ ఆసుపత్రికి చేరుకుని పర్యవేక్షించారు. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ జె.సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యులు ఏపీ కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌కు సీటీ స్కానింగ్, ఈసీజీ, బీపీ, తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమెను మెరుగైన వైద్య కోసం ప్రభుత్వ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాణీప్రసాద్‌ను తెలంగాణ కేడర్ నుంచి కేంద్రప్రభుత్వం ఏపీ రాష్ట్ర కేడర్‌కు కేటాయించటంతో ఆమె ఏపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సన్నాహాలు

(5పేజీ తరువాయి)

వారికి మాత్రమే సాయం అందించనుంది. అందుకు అర్హుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకురానుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన యాప్ మాదిరిగా రాష్ట్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను రూపొందించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలతో సరిపోల్చేందుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలిసింది.

త్వరలో ఇందిరమ్మ కమిటీలు

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో కీలక పాత్ర పోషించే ఇందిరమ్మ కమిటీలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఇందిరమ్మ కమిటీలపై అధికారులు అక్టోబరు 20వ తేదీన ప్రభుత్వానికి నివేదించారు. ఈ కమిటీలను ఈ వారంలోగా ఆమోదించనున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాకు నియమించే ఇన్‌చార్జీ మంత్రి ఈ కమిటీలను ఆమోదించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేట జిల్లాలో 475, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. అదేవిధంగా మూడు జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. అటూ పంచాయతీలు, ఇటూ మునిసిపాలిటీల్లోనూ ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. పంచాయతీల్లో కార్యదర్శి ఇందిరమ్మ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, మునిసిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర అధికారులు బాధ్యులుగా ఉంటారు. వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు ఆమోద ప్రక్రియ పూర్తి అయితే లబ్ధిదారుల ఎంపికలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. అదేవిధంగా ఈనెల 15వ తేదీ నుంచి గ్రామసభలను నిర్వహించి లబ్ధిదారుల ఎంపికను చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో కమిటీలో ఐదుగురిని నియమించారు. గతంలో ప్రజాపాలన సందర్భంగా ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఈనెల 6వ తేదీ నుంచి పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత గ్రామ సభల్లో లబ్ధిదారుల ఎంపిక చేపడుతారు.

రాజకీయ నేతల జోక్యం లేకుండా నివారించేనా?

గ్రామ, పట్టణస్థాయిలోని వార్డుల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులను ధ్రువీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వం తహసీల్దార్లకు అప్పగించింది. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్‌లు లేనందున కార్యదర్శులకు బాధ్యత ఇవ్వగా, పట్టణ స్థాయిల్లో మాత్రం వార్డు కౌన్సిలర్లు ఇందిరమ్మ కమిటీల్లో ఉన్నారు. అయితే రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించడం అధికారుల బాధ్యత. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల నాయకులు జోక్యం ఉండే అవకాశం లేకపోలేదు. దీంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారులు 400చదరపు అడుగుల స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలి. అందుకు ప్రభుత్వం రూ.5లక్షలు సాయంగా అందించనుంది. ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా నిర్వహించే యోచనలో ఉంది. వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు ఆమోదం వస్తే పథకం వేగవంతమయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి కూడా ఇబ్బందే. ఇక ఇళ్లు లేని నిరుపేదలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే నియోజకవర్గానికి కేవలం 3,500 ఇళ్లు అంటే ఒక్కో గ్రామానికి ఎన్ని మంజూరవుతాయో తెలియదు. ఈ కేటాయింపు కూడా సమస్యగా మారే అవకాశం ఉంది. మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించిన ప్రభుత్వం వచ్చే ఏడాది అసెంబ్లీలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి ఇళ్ల సంఖ్యను పెంచుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.150	220	260
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.60
టీఎంసీలు	305.8626
ఎడమకాల్వకు నీటి విడుదల	6,791
కుడికాల్వకు	9,700
విద్యుత్ కేంద్రం ద్వారా	29,354
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	37,080క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	47,445 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.15 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	29,661 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	26,945క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	1

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	738.37 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	738.37 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



రవితేజ(ఫైల్)

ఆలేరు రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండ లంలోని టంగుటూరు గ్రామస్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. ఎస్ఐ రజినికర్ తెలి పిన వివరాల ప్రకారం.. ఆలేరులోని బీసీ కాలనీకి చెందిన రాథోడ్ ప్రకాశ్ హోటల్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రకాశ్ పెద్ద కుమారుడు రాపోల్ రవితేజ(23) తనతో పాటు 10వ తరగతి చదివిన విద్యార్థులు టంగుటూరులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మిత్రుడు కుసుమ సంజయ్‌తో కలిసి బైక్‌పై వెళ్లాడు. ఆలేరులో వస్తువులు తీసుకొని నుంచి తిరిగి టంగుటూరు గ్రామానికి వెళ్తుండగా టంగుటూరు గ్రామ క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా కారు వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో రవితేజ తలకు తీవ్ర గాయమైంది. మిత్రుడు కుసుమ సంజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా రవితేజ మృతిచెందాడు. రవితేజ రాయిగిరిలోని యూనిటీ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరులోని కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ డివైడర్‌ను ఢీకొని...

భువనగిరి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ట్రాక్టర్ డివైడర్‌ను ఢీకొని డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకరారం... భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడేనికి చెందిన గజ్జి నర్సింహ(43) టెంపుల్ సిటీలో గ్రీనరీ కోసం నీళ్లు పట్టేందుకు టీఎస్ 25ఏ 7137 నంబరు గల ట్రాక్టర్ ట్యాంకర్‌పై డ్రైవర్‌గా డ్యూటీ చేస్తున్నాడు. రోజు మాదిరిగానే టెంపుల్ సిటీ రోడ్డు వెంట వెళ్తుండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదాంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింహకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు తాళలేక

వివాహిత ఆత్మహత్య

బీబీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తవారింటి వేధింపులు తట్టుకోలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. బీబీనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గ్రామానికి చెందిన తర్రె మల్లేశ్ కుమార్తె స్వప్న(34)ను బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శంకరయ్య కుమారుడు గణేశ్‌తో పది సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త గణేశ్, అత్త లక్ష్మమ్మ, బావ రమేశ్ కట్నం కోసం స్వప్నను కొన్నిరోజులుగా అదనపు మానసిక వేధింపులకు గురిచేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన స్వప్న సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. తన సోదరి మృతిపై అనుమానాలు ఉన్నాయని స్వప్న సోదరుడు తర్రె నాగరాజు, బావ గణేశ్ అతని కుటుంబసభ్యులపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి యత్నం

కేతేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం తలుపులు ధ్వంసం చేసేందుకు ఆగంతకులు ప్రయత్నించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఆదివారం సెలవు కావడంతో అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉంది. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి అంగన్‌వాడీ కేంద్రం తలుపులను రాళ్లతో పగులగొట్టేందుకు యత్నించారు. తాళం పగలకున్నా తలుపు, తాళంపై రాళ్లతో కొట్టిన గుర్తులు, పగులగొట్టేందుకు వాడిన రాళ్లు అక్కడే ఉన్నాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో ఇసుక అక్రమగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ డి. వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన జంగిలి శంకర్ తన ట్రాక్టర్ ద్వారా గ్రామ శివారులోని మూసీ వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

గరిడేపల్లి, నవంబరు 4: ఆటోలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని హుజూర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్లు గంజ వెంకన్న, గంజ వీరబాబు ఆదివారం రాత్రి తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

● నలుగురు ప్రయాణికులకు గాయాలు ● వృద్ధురాలికి తీవ్ర గాయాలు ● పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు





బోల్తా పడిన ఆర్టీసీ బస్సు, ప్రమాదంలో గాయపడిన ప్రయాణికురాలు సుగుణమ్మ

చౌటుప్పల్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు బుర్రోళ్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిపోకు చెందిన ఏపీ 20 జెడ్ 0085 నెంబర్ గల ఆర్టీసీ బస్సు 48మంది ప్రయాణికులతో సోమవారం ఉదయం 11.30గంటలకు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బయ లుదేరింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు బుర్రోళ్లగూడెం గ్రామం వద్దకు రాగానే అతి వేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ప్రమాదంలో నార్కెట్‌పల్లికి చెందిన బొప్పని విజయ(45), నకిరేకల్‌కు చెందిన మారుపాక అనిత(42), నాంపల్లి మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన బుషిపాక అండాలు (45), నల్లగొండకు చెందిన సుగుణమ్మ (65) గాయపడ్డారు. ప్రయాణికుల్లో ఒకరు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది సం ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుగుణమ్మ పరిస్థితి విష మంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ ఐతగోని జంగయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రయా ణికులను మరొక బస్సులో గమ్యస్థానానికి తరలించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

● ఉమ్మడి జిల్లాలో మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన ఉమ్మడి జిల్లాలోని మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచుల పదవీ కాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. బిల్లులు చెల్లించి సర్పంచ్‌లను ఆదుకోవాలన్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఆందోళనకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం దారుణమన్నారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, హుజూర్‌నగర్ మద్దిరాల, నూతనకల్, నేరేడుచర్ల, చిలుకూరు, నాగారం నల్లగొండ జిల్లాలో కనగల్, నకిరేకల్, పెద్దవూర, యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, రాజాపేట, అడ్డగూడూరు మండలాల మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

● డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్

మునుగోడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు శ్రమించి పండించిన పంటలను కొనుగోలు చేయడంలో జాప్యం చేయవద్దని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా మునుగోడులోని పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత పేరుతో పత్తి కొనుగోలు చేయడంలేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నిర్వాహకులతో పాటు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫోన్‌లో మాట్లాడారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, చండూరు ఏఎంసీ కార్యదర్శి కత్తుల రవి, నాయకులు బూడిద లింగయ్యయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి, బీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

గుండాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ సీఈవో డి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గుండాల మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

గుమ్మడవెల్లిలో రైతు అనుమానాస్పద మృతి



శ్రీను(ఫైల్)

కొండమల్లేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలో గల గుమ్మడవెల్లిలో ఓ రైతు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను (39) తనకున్న రెండు ఎకరాలతో పాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని, వరి, పత్తి, మిర్చి సాగు చేశాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో శ్రీను పొలం వద్దకు వెళ్లాడు. ఉదయం 9.30 గంటల సమయంలో శ్రీను భార్య కవిత, తల్లి ఇతర కూలీలతో కలిసి పత్తి తీసేందుకు పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే శ్రీను పొలంలో విగతజీవిగా పడి ఉండటంతో గమనించిన భార్య తల్లి సమీపంలోని వారి సహాయంతో 108 అంబులెన్స్‌లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శ్రీను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీను ఎడమ భుజం కింది భాగాన గాయంతో పాటు చర్మం చీలి ఉండటంతో మృతుడి కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

పెద్దదేవులపల్లిలో విద్యుదాఘాతంతో..



సైదులు (ఫైల్)

మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నేలవాలిన వరి పొలంపైకి ఎత్తుతుండగా విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో సోమవారం జరిగిందది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన కుంచెం సైదులు(45) గ్రామ శివారులోని తన వరిపొలంలో నేలకొరిగిన వరి పంటను పైకి లేపే క్రమంలో అతని కుడి చేయి ప్రమాదవశాత్తు విద్యుత్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. గమనించిన భార్య, స్థానికులు వెంటనే సైదులును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య కుంచెం లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సైదులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు తస్కరించి.. జల్సాలు చేస్తూ

● రెండు కేసుల్లో 8మంది ముఠా సభ్యుల అరెస్టు ● రూ.25లక్షల విలువైన 27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ



ద్విచక్ర వాహనాలను చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, నవంబరు 4: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తూ వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన బారీ నాగరాజు మఠంపల్లి మండలం మట్టపల్లిలో ద్విచక్ర వాహనాలను మరమ్మతు చేసే దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే గుంజి రామాంజనేయులు, వ్యవసాయం చేసే షేక్‌ఖాసీంవలీభాషా, వ్యవసాయం చేసే గుంజి కృష్ణ తరచూ తమ వాహనాల మరమ్మతుల నిమిత్తం నాగరాజు వద్దకు వెళ్లేవారు. ఈ క్రమంలో నాగరాజుకు వారితో స్నేహం ఏర్పడింది. నాగరాజు గతంలో చోరీ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను వారికి విక్రయించాడు. ద్విచక్ర వాహనాలు చోరీ చేయాలని నలుగురు నిర్ణయించుకున్నారు. వారికి తంగెడ గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసే తమ్మిశెట్టి వెంకటేష్, గోపాలకృష్ణ తోడయ్యారు. కొంత కాలంగా ఈ ముఠా కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, మఠంపల్లి, నరసరావుపేట, రెంటచింతల, చైతన్యపురి, దామరచర్ల, ఎల్బీనగర్, చైతన్యపురి, అద్దంకి, రాజుపాలెం, కాచిగూడ, మాచర్ల ప్రాంతాల్లో ఖరీదైన(బుల్లెట్ మోడల్ వాహనం) ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవారు. వాటిని విక్రయించగా వచ్చిన నగదును పంచుకుని జల్సా చేసేవారు. కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము తన సిబ్బందితో ఈ నెల 3వ తేదీన హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో నాగరాజు, కృష్ణ, ఖాసీంవలీ భాషా, రామాంజనేయులు, వెంకటేష్ రెండు ద్విచక్ర వాహనాలపై వెళుతున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపాలని చూపించాలని పోలీసు సిబ్బంది అడగటంతో తమ వద్ద లేవని సమాధానమిచ్చారు. వారి ప్రవర్తన అనుమానంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా, కొంతకాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాం తాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిపై కేసులు నమోదుచేసి చోరీ చేసిన సుమారు రూ.22లక్షల విలువ చేసే 21 ద్విచక్ర వాహనాలను వాటిని కొనుగోలు చేసినవారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు గోపాలకృష్ణ పరారీలో ఉన్నాడు.

వ్యాపారాల్లో వచ్చిన డబ్బులు సరిపోక..

సూర్యాపేట జిల్లా మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల మండలకేంద్రానికి చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించే మెచ్చర్ల శ్రీను, లారీ క్లీనర్ అలుగుల తరుణ్, చికెన్ సెంటర్ నిర్వహించే కొంక చిన్ను స్నేహితులు. వ్యాపారాల్లో వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో ద్విచక్ర వాహనాలను చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది మే నుంచి సూర్యాపేట జిల్లా మునగాల, కోదాడ, ఏపీ రాష్ట్రంలోని విజయవాడ, పెనమలూరు ప్రాంతాల్లో ఖరీదైన ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవారు. వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో ఈ నెల 3వ తేదీన మండల పరిధిలోని ముకుందాపురం స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో సదరు వ్యక్తులు కోదాడ వైపు నుంచి సూర్యాపేట వైపు వస్తున్నారు. వారిని ఆపిన పోలీసులు వాహనాల పత్రాలు చూపించాలని అడిగారు. వారు కాగితాలు చూపించకపోవడంతో అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. మేనెల నుంచి కోదాడ, విజయవాడ, మునగాల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి రూ.3లక్షల విలువ చేసే ఆరు ద్విచక్ర వాహనాలను వాటిని కొనుగోలు చేసిన వారినుంచి స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు రివార్డులు అందజేసిన ఎస్పీ

అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్న కోదాడ, మునగాల, సీసీఎస్ పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో పాటు టెక్నికల్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బీఐ వీరరాఘవులు, కోదాడ పట్టణ, మునగాల సీఐలు రాము, రామకృష్ణారెడ్డి, సీసీఎస్ సీఐ శివకుమార్, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, రంజిత్‌రెడ్డి, శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

CLASSIFIEDS

SSC మెమో పోయినది

★ సియేపేర లక్ష్మీపతి, తండ్రి: సత్తయ్య, ఇంటి నెం. 2-29/A, గ్రా॥ కొండాపురం, మం॥ చండూరు, జిల్లా నల్లగొండకు సంబంధించిన 10TH మెమో కొండాపురం నుండి నల్లగొండకు ఆటోలో వెళ్లుచుండగా మార్గమధ్యలో పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు. సెల్ : 99082 90910

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST
9985413365
9985413656
SURYAPET DIST
9703618713,
9985401015
YADADRI BHONGIRI DIST
9985410384

పంటలను వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

మునుగోడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన పత్తి, వరి ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మునుగోడు సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మార్కెట్‌లలో పత్తి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పంటలను కొనుగోలు చేయకపోయటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమశాతం పేరుతో సీసీఐ కేంద్రం నిర్వాహకులు కొనుగోలు జాప్యం చేయడం ఏమిటనీ ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు బొల్గూరి నర్సింహ, వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, లింగయ్య, యాదయ్య, పాండు, దుబ్బ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

ఆహ్లాదం.. ఆనందం..

» ప్రారంభానికి సిద్ధమైన దేవరకొండ ఖిల్లా పార్కు » పర్యాటకులను ఆకట్టుకుంటున్న పార్కు » పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



పూర్తయిన దేవరకొండ ఖిల్లాలోని పార్కు





దేవరకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాలోని ఐదు ఎకరాల స్థలంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పార్కు ప్రారంభానికి సిద్ధం కావడంతో సాయంత్రం సమయంలో పర్యాటకులతో పాటు పట్టణ ప్రజలు పార్కులోకి వచ్చి సేద తీరుతున్నారు. 2018లో రూ.5 కోట్ల వ్యయంతో ఐదు ఎకరాలలో పార్కు నిర్మాణ పనులు చేపట్టారు. ఆరేళ్ల తర్వాత పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. విశాలమైన స్థలంలో పర్యాటకులు సేదతీరేలా నిర్మాణ పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట సామగ్రి, అందమైన పూలమొక్కలు, చెట్లకు నీరందించేందుకు డ్రిప్పు ఇరిగేషన్ విధానం ఏర్పాటు చేశారు. పార్కులో రోడ్డు, లైట్లు ఏర్పాటు చేశారు. పర్యాటకుల కోసం క్యాంటిన్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పార్కు నిర్మాణం పూర్తవడంతో దేవరకొండ ఖిల్లాకు పర్యాటక శోభ వచ్చింది. దేవరకొండ ఖిల్లాకు 700 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వానికి అధికార చిహ్నమైన పూర్ణకుంభాన్ని అందించిన చరిత్ర దేవరకొండ ఖిల్లాకు ఉంది. గిరి దుర్గంగా పేరొందిన దేవరకొండ కోట 524 ఎకరాలలో 550 అడుగుల ఎత్తులో నిర్మితమై ఉంది. దేవరకొండ ఖిల్లాలో శివరాత్రి, ఏకాదశికి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. దేవరకొండ ఖిల్లాలోని కోనేరుకు ప్రాధాన్యత ఉంది. ఎంత కరువు వచ్చినా కోనేరులో నీరు సంవృద్ధిగా ఉంటుంది. విదేశీయులు సైతం దేవరకొండ ఖిల్లాను సందర్శించి అనుభూతిని పొందుతున్నారు.

ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



దేవరకొండ ఖిల్లాకు సుదీర్ఘ చరిత్ర ఉంది. నిధులు కేటాయించి ఖిల్లాను అభివృద్ధి చేయాలి. ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, గోపురాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి ఖిల్లాకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

\- అంకం చంద్రమౌళి, దేవరకొండ

త్వరలో పార్కును ప్రారంభిస్తాం

దేవరకొండ ఖిల్లాలోని పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.5 కోట్లతో పనులు పూర్తి చేశాం. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో పార్కు ప్రారంభంకానుంది. పర్యాటకులకు పార్కులో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

\- రాజు, మునిసిపల్ ఏఈ

దేవరకొండకు సమీపంలో పర్యాటక ప్రాంతాలు

చందంపేట మండలం అటవీ ప్రాంతంలోని మునుస్వామి గుట్టల్లో వెలసిన పరమేశ్వరుడి ఆలయం పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) పర్యాటకులను ఆకట్టుకుంటుంది. డిండి ప్రాజెక్టు, నిజాం కాలంలో నిర్మించిన బాపన్‌కుంట అతిథిగృహం, చారిత్రక ప్రదేశాలు నల్లగొండ నుంచి 60 కిలోమీటర్లు, నాగార్జునసాగర్ నుంచి 50 కిలోమీటర్లు, హైదరాబాద్ నుంచి వంద కిలోమీటర్ల దూరంలో దేవరకొండ ఖిల్లా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రూ.500 కోట్లు కేటాయించాలని స్థానికులతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలం ముప్పారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ మరమ్మతులు ఉన్నందున మంగళవారం సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వేంపాడ్, గగన్‌పల్లివారిగూడెం, బాలాపురం, ముప్పారం, సోమారిగూడెం, ఊట్కూరు, నందికొండవారిగూడెం, వెంగన్నగూడెం గ్రామాల్లో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ కల్యాణి ఓ ప్రకటనలో తెలిపారు.

సీసీఐ కేంద్రం ఏర్పాటు

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లిలో గల వరలక్ష్మీ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జానయ్య తెలిపారు. ఈ కేంద్రంలో 6న పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే వీరేశం ప్రారంభిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

మర్రిగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ సామాజిక సిబ్బందికి కూలీలు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

నల్లగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అర్హత ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని టీపీయూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుల్ల సాయిరెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ఎంజీ యూనివర్సిటీలో ప్రొఫెసర్లను సోమవారం కలిసి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన మందకృష్ణమాదిగ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణను అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చింత ముత్యాలరావు, పోతేపాక సాంబయ్య, పెరిక మునికుమార్, శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను అరికట్టాలి

చింతపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను దోచుకుంటున్న దళారీ వ్యవస్థను శాశ్వతంగా అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సైతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

బీసీ కులగణన కమిటీ ఏర్పాటు హర్షనీయం

మిర్యాలగూడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన డెడికేషన్ కమిటీ ఏర్పాటు హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తలెత్తకుండా కమిటీ ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన విషయమని అన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం రాఘవేంద్రసింగ్

నల్లగొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడూ చట్టాలపై అవగాహనతో పాటు నిజాయితీగా ఉండటం వల్ల జాతి నిర్మాణంలో భాగస్వాములు కావచ్చని భారత ఆహార సంస్థ జిల్లా ఏజీఎం డాక్టర్ రాఘవేంద్రసింగ్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలనే లక్ష్యంతో, భారత ప్రభుత్వం, భారత ఆహార సంస్థ వివిధ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య భారత నిర్మాణ సాధనలో భారత ఆహార సంస్థ పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. అనంతరం సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు ఆర్ఎన్‌కె ప్రసాద్, రఘుపతి, శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, సిబ్బంది డాక్టర్ సునీత, సమత, సమన్వయకర్తలు సతీష్‌రెడ్డి, అశ్విని, సునంద, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు నిజమైన త్యాగధనులు : జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు నిజమైన త్యాగధనులని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవుల కోసం ఆశపడకుండా ప్రజా సమస్యలే పరిష్కార ఎజెండాగా పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు గ్రామస్థాయిలో ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. కేంద్రం ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పేదలపై ధరల భారాలను మోపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్ నాయక్, ఎర్రనాయక్, దయానంద్, ఖాజా మోయినుద్దీన్, శశిధర్‌రెడ్డి, అంజాద్, అయూబ్, పాపానాయక్, కోటిరెడ్డి, గోపి, దుర్గయ్య, సుభాని, మట్టయ్య వెంకటయ్య, శ్రీను, విజయ్, శ్రీహరి, అంజయ్య, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం : చిరుమర్తి



నార్కట్‌పల్లి : కొనుగోలు కేంద్రంలోని తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న చిరుమర్తి

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలించి నెల రోజులు గడుస్తున్నా నేటికి కాంటా వేయకపోవడంతో అకాల వర్షాలకు తడవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓ పాలసీ లేదని, రైతులకు రుణమాఫీ పూర్తిగా చేయలేదని, రైతుబంధు ఇవ్వలేదని, ఇస్తానన్న బోనస్ జాడేలేదని చిరుమర్తి విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, చిరుమర్తి యాదయ్య మేకల రాజిరెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, విష్ణుమూర్తి, వాజిద్‌అలి, మహేశ్వరం సతీశ్, సత్తిరెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

సుంకిశాలతండా సమస్యలు పరిష్కరించాలి

తిరుమలగిరి(సాగర్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురై పునరావాస తండాగా ఏర్పడిన సుంకిశాలతండాలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కేలావత్ నగేష్‌నాయక్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సుంకిశాలతండా సమస్యల గురించి విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నా తమ భూములకు పట్టా పాస్ పుస్తకాలు అందలేదని, పైలట్ ప్రాజెక్టులో భాగంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి మాట్లాడుతూ త్వరలోనే మండలంలోని తండాలను సందర్శిస్తానని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారి వెంట నాయకులు సాగర్, రాజశేఖర్ ఉన్నారు.

'ఆలయ, ప్రభుత్వ భూములను కాపాడాలి '

చిట్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ తిరుమలనాథస్వామి దేవాలయానికి సంబంధించిన భూములు, ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 80 ఎకరాల దేవాదాయ శాఖ, 20ఎకరాలు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని అన్నారు. వాటికి హద్దులు నిర్ణయించి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పొట్లపల్లి చిన్నస్వామిగౌడ్, పొట్లపల్లి నర్సింహగౌడ్, గణేష్‌మాదిగ, యాదగిరి, దామోదర్, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి



కేతేపల్లి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, వీబీకేలు, పంచాయతీ కార్యదర్శులు, పలు విభాగాల అధికారులు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేకు మొదటి ఫేజ్‌లో 6-9 తేదీ వరకు ఎన్యూమరేటర్లు వారి పరిధిలోని ప్రాంతాల్లో ఇంటింటికీ నెంబరింగ్ చేస్తారని అన్నారు. రెండోదశలో 10 తేదీ నుంచి కుటుంబాల వారీగా వివరాలు నమోదు చేస్తారని అన్నారు. ఎన్యూమరేటర్లు నమోదు చేసిన వివరాలను వెంటనే కంప్యూటర్లలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. నవంబరు చివరి వరకు లేదా డిసెంబరు మొదటి వారంలోగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

● మిర్యాలగూడలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ మాట్లాడుతూ డివిజన్‌లో వివిధ మండలాల పరిధిలోని గ్రామాల్లో 30 రేషన్ దుకాణాల నిర్వహణకు డీలర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● కేతేపల్లిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, తిప్పర్తిలో మండల ప్రత్యేక అధికారిణి ఛాయాదేవి, దామరచర్లలో కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ పత్యానాయక్, శాలిగౌరారం మండల ప్రత్యేకాధికారి ఎం.మాన్యానాయక్, గట్టుప్పల్‌లో చండూరు ఆర్డీవో శ్రీదేవి, పెద్దఅడిశర్లపల్లిలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, మర్రిగూడలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, కట్టంగూరు, నార్కట్‌పల్లిలో తహసీల్దార్లు గుగులోతు ప్రసాద్, ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సలహాలు, సూచనలు చేశారు. సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే విషయాలను గోప్యంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కల్లేపల్లి బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి : ఎంపీ



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

దామరచర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కల్లేపల్లిలో కొలువైన బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని కల్లేపల్లిలో నిఆలయ ప్రాంగణంలో సోమవారం నూతన పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కల్లేపల్లి బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారని అన్నారు. ఆలయాన్ని దేవాదాయశాఖ సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం, వసతిగృహాల ఏర్పాటుతో పాటు మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దేవాలయ చైర్మన్‌గా ధీరావత్ దస్రునాయక్, పాలకవర్గ సభ్యులుగా జాను, అమ్మ, చినసైదులు, లక్ష్మమ్మ, భోజ్యా, మంగ్యా, మంగ్తా, సుధాకర్, బాలు, బహదూర్, కిషన్, సైదానాయక్‌లతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా మాలు నాయక్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్, పొదిల శ్రీనివాస్, రామలింగయ్య, మాజీ సర్పంచ్ జనార్దన్, లింగానాయక్, నెహ్రూ, పాచునాయక్, ఆలయ ఈవో కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : వీరేశం



అయిటిపాముల వద్ద సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామ సమీపంలోని సీసీఐ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా కొంత మినహాయింపుతో పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, పెద్ది యాదగిరి, బూరుగు శ్రీను, ఆకుల కృష్ణ, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, బెజవాడ సైదులు, రెడ్డిపల్లి స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

నకిరేకల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. చెకుముకి సంబరాల పోస్టర్లు, కరపత్రాలను జేవీవీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించడానికి చెకుముకి సంబరాలు తోడ్పడుతాయన్నారు. జేవీవీ నాయకులు మాట్లాడుతూ చెకుముఖి సైన్స్ సంబరాలలో పాల్గొనేందుకు 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

ఈ నెల 7న పాఠశాల స్థాయి, 21న మండల, 28 జిల్లా స్థాయిలో, డిసెంబరు 14,15,16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పరీక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, గంగాధరి భద్రయ్య, వినగేష్, కె. శ్రీనివాస్, సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మర్రిగూడ, కనగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, మర్రిగూడ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాక, మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. 17శాతంలోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సీఈవో తిరుపతికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మల్లేపల్లి డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, ఏవో జానకిరాములు, మర్రిగూడలో ఐకేపీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని పొనుగోడు, జీఎడవల్లి, కనగల్ గ్రామాల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. లారీల కొరత లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఐ యాదగిరి, సీసీలు ప్రభాకర్, వసంత, మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

మర్రిగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ పథకంలో విధులు నిర్వహిస్తున్న వీవోఏలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఐకేపీ, వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనం ఇవ్వాలన్నారు. ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ ఏపీఎం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంట మంజుల, పద్మ, అయితగోని సరిత, వట్టిపల్లి మహేష్, భారతమ్మ, కడారి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్య ఓటు వేయండి : నర్సిరెడ్డి

కట్టంగూరు, నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాలలోని పలు పాఠశాలల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. టీచర్లందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య, నాయకులు దేశపాక కృష్ణ, పుట్ట రాములు, నార్కట్‌పల్లిలో నర్రా శేఖర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నర్రా రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, కోశాధికారి నరేష్ పాల్గొన్నారు.

పెంచిన చార్జీలకు అనుగుణంగా మెనూ అందించాలి

మిర్యాలగూడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ కోరారు. ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ మేరకు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు సుమాన్, మనీ నాయక్, అనిల్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కేతేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. వసతిగృహ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుదలను హర్షిస్తూ కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు వద్ద గల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● దేవరకొండ: విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానగంటి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్ వసతిగృహంలో విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి

చిట్యాల, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): సీపీఎం చిట్యాల పట్టణ కార్యదర్శిగా బొబ్బల సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఐతరాజు యాదయ్య, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి

దేవరకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో ప్రధాన రహదారిపై నాటిన కోనోకార్పస్ మొక్కలు ప్రాణాంతకమైనవని, పర్యావరణానికి హాని కలిగిస్తున్నందున మొక్కలను తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

'కేటీఆర్ పాదయాత్రతో పార్టీ బలోపేతం ఖాయం'

శాలిగౌరారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్రతో రాష్ట్రంలో పార్టీ బలోపేతమవుతుందని బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఇంద్రకంటి రమేష్ అన్నారు.